క్లుప్తంగా

మహాలక్ష్మి సన్నిధిలో అన్నప్రసాద వితరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు. సుమారు రెండు వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బీసీ రక్షణ చట్టం ఎక్కడా..?

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన బీసీ రక్షణ చట్టం ఎక్కడా అని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'జనాభాలో సగం తెలుగుదేశంతో మనం' అంటూ ఎన్నికలకు ముందు టీడీపీ బీసీలకు ఇచ్చిన స్లోగన్ అని పేర్కొన్నారు. కానీ ఎన్నికల్లో ఇచ్చినట్లుగా బీసీలకు ప్రభుత్వం ఎటువంటి మేలు చేయడం లేదని తెలిపారు. అధికారంలోకి వచ్చాక జనాభాలో సగం బీసీలను మర్చిపోయారా లేదా తక్కువైపోయారో చెప్పాలని ప్రశ్నించారు.

ఆవిష్కరణలపై పట్టు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని సీనియర్ డేటా బేస్ ఎనలిస్ట్ అండ్ ఇంజినీర్ రామకిరణ్ గుప్తా అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం డేటాబేస్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు – సమస్యలపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. రామకిరణ్‌గుప్తా మాట్లాడుతూ డేటాబేస్ రంగంలో అనేక నూతన అంశాలు ముందుకు వస్తున్నాయన్నారు. అందులో భాగంగా మంగోడిబీ అట్లాస్ సాఫ్ట్‌వేర్‌తో వ్యాపార రంగంలో నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశముంటుందన్నారు. సమస్యలను విశ్లేషించి తగిన సూచనలు చేయడానికి ఈ సాఫ్ట్‌వేర్ ఉపకరిస్తుందన్నారు. సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ వీటీ రామపవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా 'పొట్టేల్'

చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల



లబ్బీపేట(విజయవాడతూర్పు): తెలంగాణ నేపథ్యంలో సాగే పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఎంతో ఆసక్తికరంగా ఉంటుందని ఆ చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల అన్నారు. ఈ నెల 25న విడుదల కానున్న పొట్టేల్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు సోమవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అనన్య మాట్లాడుతూ ఇప్పటి వరకూ తాను చేసిన చిత్రాల కంటే భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం హీరో యువచంద్ర కృష్ణ మాట్లాడుతూ దర్శకుడు సాహిత్ మోతుకూరి చెప్పిన కథ నచ్చి, వెంటనే పొట్టేల్ చిత్రంలో నటించినట్లు తెలిపారు. సమావేశంలో చిత్ర సహనిర్మాత నిశాంక్‌రెడ్డి, నటుడు నోయల్ పాల్గొన్నారు.

అలుపెరుగని బాలల హక్కుల నేత టీవీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీధి బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రథమ మేయర్ టి. వెంకటేశ్వరరావు(టీవీ) అలుపెరగని కృషి చేశారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కోఆర్డినేటర్ అరవ రమేష్ అన్నారు. హనుమాన్‌పేటలోని తానా భవన్‌లో సోమవారం విజయవాడ నగర ప్రథమ మేయర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత టీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీవీ మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేసీవీ ట్రస్ట్ మేనేజర్ కె. చంద్ర, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కె. ప్రకాష్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

'షాదీ'ఖానా లక్ష్యానికి తూట్లు

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- అడ్రస్ లేని డ్రెయినేజీ వ్యవస్థ
- ఎటు చూసినా అపరిశుభ్రతే..



విద్యాధరపురం గుప్తా సెంటర్ వద్ద ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా (ఇన్‌సెట్) చుట్టూ పిచ్చి మొక్కల నడుమ నిరుపయోగంగా టాయిలెట్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేద ముస్లిం మైనార్టీలు నామమాత్రపు చార్జీలతో వివాహాలు చేసుకునేందుకే ప్రభుత్వం నగరంలో పలు షాదీఖానాలను నిర్మించింది. అందులో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా నివసించే పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతం విద్యాధరపురం గుప్తా సెంటర్‌లో నిర్మించిన ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా ఒకటి. దీనిని నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యం. షాదీఖానా నిర్వహణ చూస్తే నానాటికీ తీసికట్టుగా తయారయింది. ముస్లిం మైనార్టీల 'షాదీ'ఖానా లక్ష్యానికే తూట్లు పొడుస్తున్న వైనం కళ్లకు స్పష్టంగా కనపడుతోంది. అసలు అక్కడ పరిస్థితి చూస్తే దీని నిర్వహణ బాధ్యతలను చూడాల్సిన ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ పూర్తిగా వదిలేసినట్లు అర్థమైపోతుంది. షాదీఖానా నిర్వహణ కోసం మైనార్టీ సంక్షేమ శాఖ స్థానిక ముస్లిం మైనార్టీలతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. పర్యవేక్షణ మాత్రం ఆ శాఖకు చెందిన అధికారే చూసుకోవాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారి నెలలో ఒక్కసారైనా వచ్చి మెయింటెనెన్స్ ఎలా ఉంది అని చూసుకుంటూ ఉంటే ఇప్పుడు ఉన్న అధ్వాన పరిస్థితి ఉండేది కాదని స్థానిక ముస్లిం మైనార్టీలు వ్యాఖ్యానిస్తున్నారు.

అధ్వానంగా పరిసరాలు..

ముస్లిం మైనార్టీల వివాహాలు, ఫంక్షన్లు చేసుకునేందుకు గతంలో రోజు అద్దెకు రూ.2వేలు మాత్రమే వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.4వేలు వసూలు చేస్తున్నారు. అద్దె కాకుండా విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.20, మున్సిపల్ చార్జి (ఫంక్షన్ అయిన తరువాత శుభ్రం చేసేందుకు) రూ.500, వాచ్‌మెన్‌కు రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ అద్దెలతో పోలిస్తే ఇది చాలా తక్కువే. అయితే షాదీ ఖానా లోపలగానీ ఆవరణలోగానీ ఎక్కడా పరిశుభ్రత అనేది కనబడదు. డ్రెయినేజీ వ్యవస్థ అడ్రసే ఉండదు. ఇక్కడ ఎప్పుడో నిర్మించిన టాయిలెట్స్ వినియోగంలో లేక వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా పడి ఉన్నాయి. వివాహాలు, ఫంక్షన్లు చేసుకునేవారితో పాటు, వచ్చిన వారి బంధువులు, స్నేహితులు అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియని దుస్థితి నెలకొంది. అద్దెకు తీసుకున్న అనేక మంది కమిటీ సభ్యులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

కమిటీ కాలపరిమితి ముగిసి 10 నెలలయినా..

షాదీఖానా నిర్వహణ కమిటీ సభ్యుల కాలపరిమితి గత ఏడాది డిసెంబర్‌కే ముగియగా కొత్త కమిటీని వేయకపోవడంలో ఆంతర్యమేమిటో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికే తెలియాల్సి ఉంది. షాదీ ఖానా ఆదాయ, వ్యయాలు, కమిటీ కార్యకలాపాలు, నిర్వహణను పర్యవేక్షించాల్సిన మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి అసలు పట్టదని, అందుకే షాదీ ఖానా మెయింటెనెన్స్ అధ్వానంగా ఉందని పలువురు స్థానిక ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ర్యాంపు నిర్మాణ పనులు పూర్తి చేయండి

కార్పొరేటర్ సత్యబాబు



మహంతీపురంలో సంతకాల సేకరణ చేస్తున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్ టీఎస్‌పీ రోడ్డులో మధ్యలో నిలిచిపోయిన ర్యాంపు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ప్రజల నుంచి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఈ రోడ్డులో కొండ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అవి మధ్యలో నిలిచిపోవడంతో ప్రజల రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. దీనిపై పలుమార్లు వీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇసుక కొరత కారణం చెప్పి పనులు చేయడం లేదని తెలిపారు. కొండ ప్రాంతంలో గతంలో మంజూరై మధ్యలో నిలిచిపోయిన రిటైనింగ్ వాల్స్ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. వీటిపై ప్రజలు పడుతున్న ఇబ్బందులను సంతకాల రూపంలో సేకరించి కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా అయినా ఆపిన పనులను ప్రారంభించాలని లేని పక్షంలో ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు పి.రాజు, బి.అప్పారావు, కోన దుర్గాప్రసాద్. అప్పలరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వెలంపల్లి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవిచంద్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ అనుబంధ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఎ.రవిచంద్ర సోమవారం మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రవిచంద్రను వెల్లంపల్లి అభినందించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాలను మరింతగా నిర్వహిస్తానని తెలిపారు. చంద్రబాబు పాలన ప్రజా, విద్యార్థి వ్యతిరేకంగా ఉందని దుయ్యబట్టారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలి



ఎస్ఆర్ఆర్ స్థలాన్ని పరిరక్షించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డున కోట్లాది రూపాయలు విలువ చేసే ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని కళాశాలకు చెందిన స్థలంలో సోమవారం పూర్వ విద్యార్థులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి తాము కళాశాల స్థలాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. కళాశాలకు చెందిన 6.67 ఎకరాలను ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారన్నారు. అప్పటి కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థి డాక్టర్ వెలగా జోషి హయాంలో స్థలాన్ని కాపాడేందుకు పూర్వ విద్యార్థులందరం కలిసి ముందుకు వచ్చామని చెప్పారు. అప్పటి ఆక్రమణలను తాము జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అడ్డుకున్నామని తెలిపారు. ఈ స్థలాన్ని దయచేసి ఎవరూ కొనవద్దని విజ్ఞప్తి చేశారు. కళాశాల స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ తాము ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి పనులు నిలిపివేయించిన జిల్లా కలెక్టర్ సృజనకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యక్షుడు ఆళ్ల వేణుగోపాలరావు, దోనేపూడి శంకర్, దోనేపూడి కాశీనాథ్, కృష్ణకుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.

లోపం లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం సాయంత్రం కృష్ణవేణి ఘాట్, పటమట హైస్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కృష్ణవేణి ఘాట్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి భవానీల వస్త్రాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన పటమట హైస్కూల్ రోడ్ లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్లలో బాత్రూంలో నిర్వహణ, నీటి సరఫరా తదితర అంశాలను ఇంజినీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొక్వల్, ఈఈ సామ్రాజ్యం, ఇతర ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం నుంచి లెక్కిస్తారని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి మహా మండపం ఆరో అంతస్తులో జరిగే లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొనున్నారని తెలిపారు. రెండు రోజులు జరిగే కానుకల లెక్కింపుతో దసరా ఆదాయం వెల్లడవుతుందని పేర్కొన్నారు.

రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలి

రైల్వే కార్మిక సంఘాల నేతలు



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘాల నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ డివిజన్ లోకో పైలట్ ఎబినేజర్ హత్యను నిరసిస్తు పలు రైల్వే కార్మిక సంఘాలు సోమవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. తొలుత ప్రాణాలు కోల్పోయిన లోకో పైలెట్‌కు నివాళులర్పించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు ప్రదర్శనగా డీఆర్ఎం కార్యాలయం చేరుకుని ఇటువంటి ఘటనలు పునావృతం కాకుండా పని ప్రదేశాలలో ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిందిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాత్రుళ్లు స్టేషన్ అవుటర్లు, యార్డ్‌లలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, పోలీసు బీటు పెంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ కె.రమేష్, ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎం వై.నాగేంద్రబాబు, మజ్దూర్ యూనియన్ రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎం.క్రాంతి కుమార్, సీఐటీయూ నాయకుడు వి.వి.ఎల్ నరసింహులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

వన్‌టౌన్ పీఎస్‌లో పూర్ణాహుతి



చండీహోమంలో సీఐ గురుప్రకాష్



అన్నదానం ప్రారంభిస్తున్న సీపీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పీఎస్ ప్రాంగణంలో సోమవారం అన్నసమారాధన జరిగింది. స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా పీఎస్ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీపీ రాజశేఖర్‌బాబు పలువురు ఐపీఎస్ అధికారులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సీపీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు అన్నదానం చేశారు. పోలీస్ కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సీపీతో పాటు నగరంలోని జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎన్ దుర్గారావు కార్యక్రమాలను నిర్వహించారు. దుర్గగుడి ఈఓ కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం : సీపీ

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని సీపీ రాజశేఖర్‌బాబు అన్నారు. పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. పదకొండు రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. వేలాది మంది సిబ్బందితో బందోబస్తు చేపట్టామన్నారు.

చలామణిలో రూ.10 నాణేలు



నాణేలు అందిస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పది రూపాయాల నాణేలు చలామణిలో ఉన్నాయని కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ జీఎన్‌బీ ఆనందకుమార్ అన్నారు. కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో నగరంలోని ఖాతాదారులు, వ్యాపారులకు నాణేలు పంపిణీ చేశారు. సామారంగంచౌక్ సెంటర్‌లో ఆ బ్యాంక్ శాఖ ఆధ్వర్యాన నాణేల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్ వంటి బ్యాంకులు, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసినట్టుగా పది రూపాయాల నాణేలు చట్టబద్ధంగా అన్ని లావాదేవీలకు సమానంగా ఉపయోగపడతాయన్నారు. వీటిని వ్యాపారాలు, వ్యక్తులు వాటిని నిరాకరించకూడదని చెప్పారు. తక్కువ విలువ గల నాణేల కొరతను తీరుస్తున్నామన్నారు.

పెట్టుబడులపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అచ్యుతరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పెట్టుబడులపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో సెబీ (సెక్యూరిటీ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)కి చెందిన ప్రముఖ శిక్షకుడు డాక్టర్ ఓలేటి అచ్యుతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పెట్టుబడులు పెట్టడంలో మెలకువలు, పొదుపు సేవలు, స్టాక్ మార్కెట్, ద్రవ్యోల్బణం, షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు తదితర పెట్టుబడి అంశాల గురించి విద్యార్థినులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో మెలకువలు తెలుసుకుని రాణించడానికి ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, సత్యవాణి, డాక్టర్ బాలకృష్ణ, అరుణ, సుమిత్ర, ప్రసాదరావు, దివ్య పాల్గొన్నారు.

భక్తజనకీలాద్రి



ఇంద్రకీలాద్రిపై మాల విరమణ చేస్తున్న భవానీలు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ప్రతిమ వద్ద భవానీలు



కొండదిగువన భక్తులు



వివిధ ప్రాంతాల నుంచి మాల విరమణకు వచ్చిన భవానీలతో సోమవారం ఇంద్రకీలాద్రి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జైభవానీ.. జైజై భవానీ అంటూ భక్తజనం అమ్మవారికి జయజయధ్వానాలు పలికారు. ఆలయ క్యూలైన్లలో భవానీలు బారులు తీరికనిపించారు. కృష్ణమ్మ చెంతన జల్లుస్నానాలు ఆచరించారు. అన్నప్రసాదం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో ఉండటంతో కింద కూర్చునే భోజనం చేశారు. అర్జున వీధిలో దుకాణాల వద్ద భక్తజన సందడి అధికంగా కనిపించింది.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కృష్ణవేణి ఘాట్‌లో జల్లు స్నానాలు



క్యూలైన్‌లో భక్తులు

2 నుంచి కార్తిక మాసోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసోత్సవాలను వచ్చేనెల 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు తెలిపారు. ఆలయంలో సోమవారం కార్తిక మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు గోపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న నాగుల చవితి సందర్భంగా నాగదోష నివారణ అభిషేకం, 15న కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, నందాదీపసేవ, జ్వాలాతోరణం జరుగుతాయని తెలిపారు. 17న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్తిక మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిరంజీవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.